క్లుప్తంగా

కళాశాలకు సీసీ కెమేరాల వితరణ

తిరువూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సీసీ కెమేరాలను డాక్టర్ కొడాలి శ్రీనివాస బహదూర్, సుజాతలు శుక్రవారం వితరణ చేశారు. కళాశాలలో భద్రతా చర్యల్లో భాగంగా రూ.10 వేల విలువైన కెమేరాలు, సామగ్రిని ప్రిన్సిపాల్ మురళీకృష్ణకు అందజేశారు. దాతలను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

నేడు సహకార సంఘంలో బ్యాంకింగ్ సేవలు ప్రారంభం

తిరువూరు: నడిం తిరువూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో శనివారం నుంచి బ్యాంకింగ్ సేవలు ప్రారంభమవుతాయని చైర్‌పర్సన్ గజ్జల సీతారామారావు తెలిపారు. కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రక్షణనిధి తమ సొసైటీలో నగదు కౌంటర్లను, లాకర్లను ప్రారంభిస్తారన్నారు.

రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాల మంజూరు



తిరువూరు: మండలంలోని 4 గ్రామాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పత్రాలు మంజూరైనట్లు తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రసన్నలక్ష్మి తెలిపారు. మండలంలో శుక్రవారం రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో ఈకేవైసీ పరిశీలనలో భాగంగా ఆర్డీఓ రైతులకు రీ సర్వే ప్రయోజనాలను వివరించారు. ముష్టికుంట్ల, చిట్టేల, వామకుంట్ల, ఆంజనేయపురం గ్రామాల్లో 1,946 మంది రైతులకు వచ్చిన భూ హక్కు పత్రాల పంపిణీ జరుగుతోందని, భూ రక్ష కింద పొలాల సరిహద్దు రాళ్లు అందజేస్తున్నామని ఆర్డీఓ తెలిపారు. రైతులు సహకరించి ప్లాంటేషన్ పూర్తి చేసుకోవాలన్నారు. తహసీల్దార్ సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



తోటమూల(గంపలగూడెం): పెద్దకొమిర కేజీబీవీలో పదో తరగతి విద్యార్థులకు అవసరమైన పరీక్ష సామగ్రిని శుక్రవారం దాతల సహకారంతో అందజేశారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో దాతలు అల్లు గణపతిరెడ్డి, గొరసాని భాస్కర్‌రెడ్డి 70 మంది విద్యార్థులకు జామెంట్రీ బాక్స్, పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. సమ్మెట్-1 పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఎం.కీర్తన, జి.ప్రేమ్‌కుమారీలను సన్మానించారు. పాఠశాలలోని 250 మంది విద్యార్థులకు మిఠాయిలు అందించారు. ప్రత్యేక అధికారి ఎం.వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకుముడత పురుగుతో దిగుబడి తగ్గుదల

మునుకుళ్ల(తిరువూరు): వరిపైరులో ఆకుముడత పురుగు ఆశిస్తే దిగుబడి గణనీయంగా తగ్గుతుందని ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయాధికారి డి.శ్రీనివాసరావు రైతులకు సూచించారు. పొలంబడి కార్యక్రమంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన మునుకుళ్ల గ్రామంలో రైతులకు వరి పైరులో సస్యరక్షణ చర్యలను వివరించేందుకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిరుపొట్ట దశలో పొటాష్ తప్పనిసరిగా వేయాలని సూచించారు. తిరువూరు ఏడీఏ కెనడీ, జిల్లా రైతు శిక్షణా కేంద్ర వ్యవసాయాధికారి సత్యవతి, రైతులు పాల్గొన్నారు.

బీసీ విభాగం బలోపేతానికి కృషి



ఇబ్రహీంపట్నం: తిరువూరు నియోజకవర్గం ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణ నిధిని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు నిడుముక్కల శివశంకరరావు తిరువూరు పార్టీ కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే రక్షణనిధిని సత్కరించారు. జిల్లాలో బీసీ విభాగం బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. తనపై నమ్మకంతో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రక్షణనిధి, వసంత కృష్ణప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకుడు గోవర్ధనరావు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే ప్రారంభం

ముసునూరు: మండల వ్యాప్తంగా 50వ ఫీవర్ సర్వేను ప్రారంభించినట్లు ముసునూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.కిరణ్ కుమార్, జి.ప్రతాప్ తెలిపారు. ముసునూరు పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో తమ సిబ్బందితో కలిసి వలంటీర్లు శుక్రవారం నుంచి సర్వే చేపట్టామన్నారు. ఈ సర్వేలో భాగంగా గ్రామాల్లో జలుబు, దగ్గు లక్షణాలతో జ్వరాలు ఉన్న వారిని గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు.

సచివాలయ వ్యవస్థతో మెరుగైన సేవలు

- కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రక్షణనిధి
- తునికిపాడులో ప్రభుత్వ భవనాల ప్రారంభం



తునికిపాడులో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన తన్నీరు నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రక్షణనిధి

తునికిపాడు(గంపలగూడెం): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన, అధికార వికేంద్రీకరణ కోసం సచివాలయ వ్యవస్థను అమలుల్లోకి తెచ్చి, మెరుగైన సేవలు అందిస్తోందని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. గంపలగూడెం మండలం తునికిపాడులో రూ.79.30 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్లను తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం స్థాపనే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన కల్పించారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు, వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామని చెప్పారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ కొనసాగాలంటే రాబోయే ఎన్నికల్లో ప్రజలు మరోమారు వైఎస్సార్ సీపీని బలపర్చాలని కోరారు.

ఒకే ప్రాంగణంలో అన్ని సేవలు

ప్రజలకు ప్రాథమికంగా అందించాల్సిన అన్ని సేవలను సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం కల్పిస్తుందని తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి తెలిపారు. నియోజకవర్గంలో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పారదర్శకంగా పరిపాలన అందిస్తోందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో గడప వద్దే పథకాలు మంజూరు చేస్తున్నామన్నారు. ఎంపీపీలు గోగులమూడి శ్రీలక్ష్మి, ఎం.గాంధీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు కోట శామ్యూల్, భూక్య గనియా, ఎంపీటీసీ సభ్యురాలు వేల్పుల విజయమ్మ, సర్పంచ్ నిడికొండ మాధవి, సొసైటీ అధ్యక్షుడు వేల్పుల చిన్న పిచ్చియ్య, నాయకులు గోగులమూడి చెన్నకేశవరెడ్డి, చెరుకు నరసారెడ్డి, కోట దాసు, సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, పీఆర్డీఈ చక్రవర్తి, వైద్యాధికారి కె.శ్రీనివాస్, ఎస్‌ఐ వి.సతీష్, సొసైటీ చైర్మన్లు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల అమలు



భగవాన్లపురంలో వృద్ధురాలికి బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

భగవాన్లపురం(గంపలగూడెం): అర్హతే ప్రామాణికంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం మండలం తునికిపాడు సచివాలయం పరిధిలోని భగవాన్లపురంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి ఎమ్మెల్యే రక్షణనిధి వెళ్లి ప్రభుత్వం పథకాలను వివరిస్తూ, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా సంక్షేమ అభివృద్ధి పథకాల అమలులో కుల, మత, రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన అందిస్తోందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు అన్ని వర్గాలకు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, సర్పంచ్ నిడికొండ మాధవి, ఎంపీటీసీ సభ్యులు వేల్పుల విజయమ్మ, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గోగులమూడి చెన్నకేశవరెడ్డి, చెరుకు నరసారెడ్డి, నల్లగట్ల బాలు, సొసైటీ అధ్యక్షుడు వేల్పుల చిన్న పిచ్చయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు తునికిపాడులో..

తునికిపాడు(గంపలగూడెం): గంపలగూడెం మండలం తునికిపాడులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే రక్షణ నిధి పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారన్నారు. మండల పరిధిలో అన్ని శాఖల అధికారులు తప్పకసరిగా హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని పార్టీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు కోరారు.

అంగన్‌వాడీ సేవలు అభినందనీయం

జడ్జి షేక్ షీరెన్

మైలవరం: గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ సేవలు అభినందనీయమని మైలవరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి షేక్ షీరెన్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా మైలవరం ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో జడ్జి షేక్ షీరెన్ మాట్లాడుతూ.. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతయుతంగా సేవలు అందిస్తున్నారన్నారు. మైనర్లకు వివాహాలు జరగకుండా నిరోధించేందుకు కృషి చేయాలని సూచించారు. మైలవరం ఐసీడీఎస్‌లో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీఓ పుష్పలత, మైలవరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బుద్దారపు వెంకట్రావు, మైలవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రవికుమార్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి



ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్‌లో మాట్లాడుతున్న పరిశ్రమల ఉప తనిఖీ అధికారి శ్రీనివాస్ తదితరులు

ఇబ్రహీంపట్నం: పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించి, ప్రమాదాలు నివారించాలని కర్మాగారాల ఉప తనిఖీ అధికారి కె.శ్రీనివాస్ తెలిపారు. 45వ జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా స్థానిక ఎన్టీటీపీఎస్‌లో ప్రమాదాల నివారణపై కార్మికులు, ఉద్యోగులకు అవగాహన సదస్సు శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు జరుగుతాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో ప్రమాదాల నివారణ జీరో స్థాయికి తీసుకురావాలని చెప్పారు. ఈసందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. చీఫ్ ఇంజినీర్ ఆశోక్‌కుమార్‌రెడ్డి, అధికారులు టి.రాజు, యు.శ్రీనివాసరావు, నాగబాబు, ఎస్ఈలు పాల్గొన్నారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో 45 మంది ఎంపిక

జూపూడి(ఇబ్రహీంపట్నం): నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 45 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన్ తెలిపారు. దివీస్ ల్యాబరేటరీస్ సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ రాజేష్ రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్స్, వివిధ విభాగాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్లేస్‌మెంట్‌కు స్థానిక విద్యార్థులతో పాటు వివిధ కళాశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రతిభ కలిగిన 45 మందిని ఎంపిక చేశారన్నారు. ఎంపికైన వారిని అకడమిక్ డైరెక్టర్ టి.నారాయణమూర్తి అభినందించారు.

కొత్తగూడెంలో డ్రోన్ సర్వే



సర్వేను ప్రారంభిస్తున్న తహసీల్దార్ విశ్వనాథరావు

చాట్రాయి: సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయ భూములను డ్రోన్ సహాయంతో రీ సర్వే చేస్తున్నట్లు తహసీల్దార్ విశ్వనాథరావు తెలిపారు. మండలంలోని తుమ్మగూడెంలో జగనన్న భూ రక్ష - రీ సర్వే కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. డ్రోన్ సహాయంతో సరిహద్దులు గుర్తించి ఆయా భూములకు సంబంధించి సర్వే రాళ్లను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మాదల నరసింహారావు, డివిజినల్ సర్వేయర్ వరహాల రాజు, మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాలలో కోర్సులకు రిజిస్ట్రేషన్

నూజివీడు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో పదో తరగతి ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ యువకులకు స్వల్ప కాలిక ఉపాధి కోర్సుల్లో శిక్షణనివ్వనున్నట్లు కళాశాల ప్రధానాధికారి డి.భూషణం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల కాల వ్యవధి కలిగిన ఈ కోర్సుల్లో శిక్షణ పొందడం ద్వారా ఉపాధి పొందవచ్చన్నారు. ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, సీసీ టీడీ ఇనస్టలేషన్ అండ్ టెక్నీషియన్, డొమిస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ ప్లంబర్(జనరల్), హోమ్ అప్లయెన్స్ టెక్నీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 15వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు 08656-232711 నంబరులో సంప్రదించాలని కోరారు.

డ్రగ్స్ రహిత సమాజమే ధ్యేయం



మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ

ఆగిరిపల్లి: డ్రగ్స్ రహిత సమాజమే ధ్యేయమని జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ అన్నారు. మండల పరిధిలోని పోతవరప్పాడు ఎన్‌ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో డ్రగ్స్ వినియోగం వలన కలిగే అనర్థాలపై ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్‌కు బానిసలై విద్యార్థులు తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. డ్రగ్స్‌ను పత్యక్షంగా, పరోక్షంగా వినియోగిస్తే 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు, భారీ జరిమానా విధిస్తామని తెలిపారు. అనంతరం నూజివీడు డీఎస్పీ ఈ.అశోక్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు అసాంఘిక చర్యలకు పాల్పడితే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు కోల్పోతారన్నారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులు పాస్‌పోర్టు కష్టాలు ఎదుర్కొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చంటిబాబు, కళాశాల చైర్మన్ ఆర్.వెంకట్రావు, ప్రిన్సిపాల్ నాగభాస్కర్, ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాగసాయి తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయురాలు సావిత్రీబాయి పూలే



విస్సన్నపేటలో నివాళులర్పిస్తున్న కేవీపీఎస్, దళిత బహుజన నాయకులు

మైలవరం: భారతీయ మహిళ సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే చిరస్మరణీయురాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా సావిత్రీబాయి పూలే వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు విద్యావంతులు కావాలని అప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆ రోజుల్లోనే సావిత్రీబాయి పూలే మహిళల కోసం పాఠశాలను ఏర్పాటు చేశారని చెప్పారు. మహిళలు సావిత్రీబాయి పూలే స్ఫూర్తితో విద్యావంతులుగా ఎదిగి తమ కుటుంబాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. మైలవరం మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధా ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహిళల అభివృద్ధికి సావిత్రీబాయి పూలే చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్, దళిత బహుజన కమిటీల ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మహిళా అభ్యున్నతికి, విద్యాభివృద్ధికి సావిత్రీబాయి ఎంతో కృషి చేశారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకుడు మేకల జ్ఞానరత్నం, లిబరేషన్ రాష్ట్ర నాయకుడు డి హరినాథ్, విశ్రాంత ఉపాధ్యాయుడు కంకట మోహనరావు, కాంతారావు, జయకర్‌బాబు, వి.నాగరాజు, జి.రాంబాబు, బ్రహ్మ పాల్గొన్నారు. మండలంలోని కొండపర్వ ఎంపీయూపీ పాఠశాలలో సావిత్రీబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. మహిళా విద్యను ప్రోత్సహించటంలో సావిత్రీబాయి పూలే చేసిన కృషిని హెచ్ఎం జయరామ్ విద్యార్థులకు వివరించారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



చాట్రాయి: విద్యార్థులు చదువులో పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని విస్సన్నపేట వికాస్ విద్యా సంస్థల చైర్మన్ ఎస్.నర్సిరెడ్డి తెలిపారు. మండలంలోని చాట్రాయి వికాస్ జూనియర్ కాలేజీ ఇంటర్ విద్యార్థుల ఫేర్‌వెల్ పార్టీలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడి, ఇష్టపడి చదివి మంచి గ్రేడ్‌లు సాధించాలని సూచించారు. విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణపై ఎంపీపీ ఆగ్రహం



చేపూరివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ మెర్సీవనజాక్షి

కొర్లమంద(విస్సన్నపేట): మండలంలోని కొర్లమండ గ్రామంలో చేపూరివారి పాలెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థులు ఏడుగురు కాగా గత నాలుగు రోజులుపైగా ముగ్గురు విద్యార్థులే హాజరు కావటం, హాజరుపట్టీలో మార్చి 3వ తేదీ నుంచి హాజరు నమోదు చేయకపోవటంతో ఎంపీపీ హాజరు ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. అలాగే గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారం వివరాల రికార్డు నమోదు సక్రమంగా చేయకపోవటం, స్టాక్ రిజిస్టర్ నమోదు చేయకపోవటంతో సంబంధిత అంగన్‌వాడీ టీచర్ సునీతపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం ఎస్సీ వాడలో ఉన్న మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల, పాఠశాల పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీపీ పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ వాడలో అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు సక్రమంగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు.

14న నులిపురుగుల నివారణ మందుల పంపిణీ

తిరువూరు: ఈ నెల 14వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. విద్యార్థులు నులిపురుగుల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ కృపారాణి వివరించారు. భోజనానికి ముందు, తర్వాత విద్యార్థులు సబ్బుతో చేతులు కడుక్కోవాలని, బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేయరాదని, మరుగుదొడ్లకు వెళ్లినపుడు కూడా చేతులు శుభ్రపరచుకోవాలని తెలిపారు. ఈ నెల 14న విద్యార్థులకు డీవార్మింగ్ మందు పంపిణీ చేయాలన్నారు. నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ, ఆరోగ్య సిబ్బంది, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉగాదికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ఉగాది నాటికి పూర్తయ్యేలా సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో 10 సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఇళ్ల నిర్మాణాలపై శుక్రవారం సమీక్షించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న రీసర్వే పనుల పురోగతిపై సచివాలయ సర్వేయర్లకు అవగాహన కల్పించారు.

పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

ఇబ్రహీంపట్నం/మైలవరం: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శుక్రవారం తెలిపారు. ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచిన దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాల సాధన కోసం ఆయన కుమారుడు వైఎస్ జగన్ 2011 మార్చి 12వ తేదీన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపించారన్నారు. 12 వసంతాలు పూర్తి చేసుకుని 13వ వసంతంలోకి అడుగు పెడుతుందన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వైఎస్ జగన్ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజలకు చేరువయ్యారన్నారు. ఆయన బాటలో నడుస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి లబ్ధిదారునికి చేరేలా చూడాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి గ్రామంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు.

రూ.19.29 కోట్ల రుణాల మంజూరు

నూజివీడు: పట్టణ పరిధిలోని జీ+3 గృహాల లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా ఇప్పటి వరకు రూ.19.29 కోట్ల రుణాలను మెప్మా అధికారులు మంజూరు చేయించారు. పట్టణంలో 1,776 మందికి గృహాలు కేటాయించగా, అందులో 1,338 మంది లబ్ధిదారులకు సేల్ డాక్యుమెంట్‌లు అందజేశారు. ఎస్‌బీ అక్కౌంట్‌లు ప్రారంభించగా, వారిలో 1,222 మంది లోన్ డాక్యుమెంట్లను బ్యాంకులకు సమర్పించారు. అందులో 817 మంది లబ్ధిదారులకు రూ.19.29 కోట్లను మంజూరు చేశారు. రూ.500 చెల్లించిన లబ్ధిదారులకు గృహాలను ఉచితంగా అందజేస్తున్నారు. దీనిలో భాగంగా 862 ప్లాట్లకు ఇప్పటికే 805 మంది లబ్ధిదారులకు ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లను పూర్తి చేశారు.

మహాజన సభ నోటీసు


ది. తిరువూరు, గంపలగూడెం మరియు ఎ.కొండూరు మండల స్కూలు టీచర్సు కో.ఆపరేటివ్ క్రెడిట్‌సొసైటీ తిరువూరు, K.R.9, ఎన్.టి.ఆర్. జిల్లా

ది. 26-03-2023, ఆదివారం మధ్యాహ్నం గం॥ 2-00 లకు తిరువూరు సంఘ కార్యాలయము నందు సంఘం యొక్క మహాజన సభ జరుగును. సంఘ సభ్యులందరూ హాజరు కావలసినదిగా కోరుచున్నాము.

ఎజెండా : 1. జమ ఖర్చులు ఆమోదము. 2. అధ్యక్షులు వారిచే ప్రవేశపెట్టబడు ఇతర అంశములు.

గోసు శ్రీనివాసరావు, కార్యదర్శి

ప్రమాదాల నివారణపై ముగిసిన శిక్షణ



గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో వారం రోజులుగా జరిగిన ప్రమాదాల నివారణ శిక్షణ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా చీఫ్ వర్క్ మేనేజర్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది రోజువారీ పనుల్లో జరిగే ప్రమాదాల నివారణపై కార్మికులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు సందర్భంగా ప్రమాదాల సమయంలో చేపట్టాల్సిన తక్షణ చర్యలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. గ్యాస్ లీకైతే తీసుకోవాల్సి జాగ్రత్తలు, వ్యక్తులు గాయపడితే ఎటువంటి చర్యలు చేపట్టాలి. అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడే పద్ధతులు, సీపీఆర్ చేసే పద్ధతిని మాక్‌డ్రిల్ ద్వారా వివరించారు. డెప్యూటీ సీఎంఈ రవీంద్ర, పలువురు అధికారులు పాల్గొన్నారు.



మట్టితో తయారు చేసిన వివిధ రకాల పాత్రలు, మంచినీటి సీసాలు తదితర వస్తువులను ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి గొల్లపూడి రోడ్డులో విక్రయానికి సిద్ధంగా ఉంచిన దృశ్యం

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

జనార్దనవరంలో రాత్రి సభ

చాట్రాయి: గ్రామంలో సమస్యల పరిష్కారానికి రాత్రి సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విశ్వనాథరావు తెలిపారు. మండలంలోని జనార్దనవరంలో శుక్రవారం రాత్రి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే సభ దృష్టికి తీసుకురావాలన్నారు. మెయిన్ రోడ్డుకు మరమ్మతులు, దళితవాడ శ్మశాన వాటిక స్థలం, మంజూరైన పీఏసీఎస్ స్థలం ఇవ్వాలని అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణ, మాజీ సర్పంచ్ పామర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.